## క్లుప్తంగా

### ఉద్యోగాలు కల్పిస్తున్న ఘనత కాంగ్రెస్‌దే

**డీసీసీ ప్రధాన కార్యదర్శి నాగరాజు**

**ప్రశాంత్‌నగర్(సిద్దిపేట):** రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీదే అని డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో నిరుద్యోగులను ఇబ్బందులకు గురిచేసి, ఇప్పుడు మొసలికాన్నీరు కార్చడం శోచనీయమన్నారు. పదేళ్లుగా ఇవ్వని ప్రభుత్వ ఉద్యోగాలు కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తుందన్నారు. మాజీమంత్రి హరీశ్‌రావు వివిధ సమావేశాల్లో నిరుద్యోగులను మభ్యపెట్టే మాటలు మాట్లాడటం సరికాదన్నారు. బీఆర్ఎస్ పార్టీ అవినీతి, అక్రమాలు చేసి అభివృద్ధిపై మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహేందర్‌రెడ్డి, నర్సింలు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

### నష్టపోయిన పంటలకు పరిహారం ఇవ్వాలి



వరిలో ఇసుక మేటలు

**హుస్నాబాద్‌రూరల్:** మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన పంటలకు పరిహారం అందజేయాలని ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ ఆదివారం కోరారు. మీర్జాపూర్, భల్లునాయక్‌తండా, వంగరామయ్యపల్లి గ్రామాల్లో వరుదలకు వరి చేళ్లలో ఇసుక మేటలు ఏర్పడ్డాయన్నారు. ప్రభుత్వం అధికారులు సర్వే చేసి నష్టపరిహారం అందించడంతో పాటు ఇసుక మేటలను తొలగించడానికి ఉపాధిహామీ పథకంలో అవకాశం కల్పించాలన్నారు. పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేస్తే వరదలతో పంట చేళ్లలో ఇసుక మేటలు పెట్టి తీవ్ర నష్టం జరిగిందన్నారు.

### పెన్షన్‌దారుల నిరసన



నిరసన తెలుపుతున్న పెన్షన్‌దారులు

**హుస్నాబాద్:** జిల్లాలోని అన్ని తహసీల్దార్ కార్యాలయాలను సోమవారం ముట్టడించాలని ఎంఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జ్ మంద కుమార్ మాదిగ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో దివ్యాంగులు, చేయూత ఫించన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ పెన్షన్‌దారులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో దివ్యాంగుల ఫించన్ రూ.6వేలు, చేయూత ఫించన్లు రూ.4వేల వరకు పెంచుతామని హామీ ఇచ్చారన్నారు. కానీ అధికారంలోకి వచ్చి 21 నెలలు గడిచిన పెన్షన్ పెంచడం లేదన్నారు. పింఛన్లు పెంచని యెడల రానున్న స్థానిక ఎన్నికల్లో గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ లక్ష్మీనారాయణ, వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు సమయ్య, జిల్లా కో ఆర్డినేటర్ సంపత్ తదితరులు ఉన్నారు.

### ముస్లింల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

**జగదేవ్‌పూర్(గజ్వేల్):** మహ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకుని ఆదివారం జగదేవ్‌పూర్‌లో మసీద్ కమిటీ ఆధ్వర్యంలో ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. ఈ మేరకు జష్నే బిలాద్ ఉన్ నబీ కార్యక్రమంలో భాగంగా ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహిస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు మునీర్, ఆహ్మద్, బషీర్, పాషా, షాదుల్లా, నజీర్, అబీబ్ తదితరులు పాల్గొన్నారు.

### స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి



మహేందర్‌ను సన్మానిస్తున్న నాయకులు

**చిన్నకోడూరు(సిద్దిపేట):** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సమష్టిగా కృషిచేసి సత్తా చాటాలని మండల పార్టీ అధ్యక్షుడు మీసం మహేందర్ సూచించారు. ఆదివారం మండల పరిధిలోని ఓబులాపూర్‌లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజేష్, రాజు, మహేష్, భాస్కర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల ‘భవిత’కు వరం

- త్వరలో అందుబాటులోకి భవనం
- రూ.6.5లక్షలతో నిర్మాణానికి నిధుల మంజూరు



అక్కన్నపేటలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్మిస్తున్న భవిత కేంద్రం

**అక్కన్నపేట(హుస్నాబాద్):** శారీరక, మానసిక వైకల్యంతో పాటు ఇతర వైకల్యం ఉన్న చిన్నారులతోపాటు ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు చికిత్స, సాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భవిత కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. వీటి ద్వారా దివ్యాంగులైన చిన్నారుల బంగారు భవిష్యత్‌కు భరోసా ఇస్తున్నారు. ఇందులో భాగంగానే మండల కేంద్రంలో భవిత కేంద్రం భవన నిర్మాణానికి అడుగులు పడ్డాయి. ఈ భవన నిర్మాణానికి రూ.6.5లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ నేపథ్యంలోనే ఈ భవిత కేంద్రాన్ని మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్, కాంగ్రెస్ మాజీ బ్లాక్ అధ్యక్షుడు ముత్యాల సంజీవ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు భవిత కేంద్రాలు ఎంతగానో భరోసాను కల్పిస్తాయన్నారు. సాధారణ విద్యార్థుల తరహాలోనే ప్రత్యేక అవసరాల కలిగిన విద్యార్థులకు కూడా విద్యాబుద్ధులు నేర్పిస్తూ, మానసిక పరిపక్వత కార్యక్రమాలతో వారిలో ఆత్మస్థైర్యం పెంచేలా ప్రభుత్వాలు కృషి చేస్తాయన్నారు. అలాగే అన్ని అవయవాలు ఉన్నా బతకడం కష్టంగా మారిన ప్రస్తుత పరిస్థితుల్లో వివిధ కారణాలతో వైకల్యంతో జన్మించిన పిల్లల పరిస్థితి ఊహించలేనిదన్నారు. అలాంటి వారిలో ఎక్కువగా మానసిక వైకల్యంతో పాటు ఇతర వైకల్యాలతో జన్మించిన పిల్లల తల్లిదండ్రుల బాధ వర్ణణాతీతమన్నారు. అలాంటి పిల్లలు సాధారణ పిల్లల తరహాలోనే విద్యాబుద్ధులు నేర్చుకుని సమాజంలో అందరూ గౌరవించేలా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ ఉద్దేశ్యం. ఇందులో భాగంగానే అక్కన్నపేటలో భవిత కేంద్రం ఏర్పాటుకు ప్రత్యేక కృషి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా త్వరలో ఈ భవిత కేంద్రం నిర్మాణ పనులు శరవేగంగా పూర్తి చేసుకొని అందుబాటులోకి రానుందన్నారు.

## మేనేజ్‌మెంట్ పర్యవేక్షణ లోపంతోనే..

**ఆర్చ్ ఫార్మా యూనియన్ గౌరవ అధ్యక్షుడు మారెడ్డి రవీందర్ రెడ్డి**



ఆర్చ్ ఫార్మా ప్రమాద విషయాలను తెలుసుకుంటున్న రవీందర్ రెడ్డి

**సిద్దిపేటఅర్బన్:** మిట్టపల్లిలోని ఆర్చ్ ఫార్మా కెమికల్ ఫ్యాక్టరీలో జరిగిన అగ్ని ప్రమాదం యాజమాన్య పర్యవేక్షణ లోపం కారణంగా జరిగిందని ఆర్చ్ ఫార్మా యూనియన్ గౌరవ అధ్యక్షుడు మారెడ్డి రవీందర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఆర్చ్ ఫార్మాను సందర్శించి ప్రమాద విషయాలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రమాద విషయాన్ని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. దసరా తర్వాత మాజీ మంత్రి హరీష్ రావును ఫ్యాక్టరీని సందర్శించి కార్మికుల సమస్యలను తెలుసుకొని పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కార్మికులు పాల్గొన్నారు.

## నిరుపయోగంగా స్త్రీశక్తి భవనం

**చిన్నకోడూరు(సిద్దిపేట):** రూ.లక్షల్లో ఖర్చు చేసి నిర్మించిన స్త్రీ శక్తి భవనం నిరుపయోగంగా మారింది. మండల కేంద్రంలో ఉపాధి హామీ నిధుల ద్వారా చిన్నకోడూరులో రూ. 25 లక్షలతో స్త్రీశక్తి భవనం నిర్మించారు. మహిళా సంఘాల సమావేశాల నిర్మించిన ఈ భవనాన్ని అధికారులు వినియోగంలోకి తీసుకురాక పోవడంతో నిరుపయోగంగా మారింది. దీంతో భవనం ఆవరణమంతా పిచ్చి మొక్కలతో నిండిపోయింది. ఈ భవనాన్ని 2013లో ప్రారంభించారు. అన్ని హంగులతో భవనం నిర్మించడంతో మండల మహిళా సంఘాల ప్రతినిధులు సమావేశాలకు అనువుగా ఉంటుందని సంతోషం వ్యక్తం చేశారు. కానీ మహిళలకు అందుబాటులో లేకపోవడంతో భవనం నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకుంది.



పిచ్చి మొక్కలతో స్త్రీశక్తి భవనం

## అపూర్వ ఆత్మీయ సమ్మేళనం



ఆనాటి గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

**సిద్దిపేటఅర్బన్:** మండలంలోని పొన్నాల ప్రభుత్వ పాఠశాలలో 1981–1982లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 43 ఏళ్ల తర్వాత ఆత్మీయ సమ్మేళనాన్ని పూర్వ విద్యార్థులు ఒకేచోట కలిసి ఆనాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యా బోధన చేసిన గ్రామానికి చెందిన ఉపాధ్యాయులు కోటయ్య, రామకృష్ణారెడ్డిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పొన్నాల అర్జున్ రెడ్డి, మహేందర్, మల్లికార్జున్, రాజు, శ్రీనివాసరాజు, సురేందర్, ఎంఎం రెడ్డి, సీహెచ్ శ్రీనివాస్ భాగ్యమ్మ, అరుణ, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లమ్మ ఆలయంలో సీఐ పూజలు



పూజల్లో సీఐ విద్యాసాగర్

**దుబ్బాక:** కోరిన కోరికలు తీర్చే మహిమ తల్లిగా పెద్దగుండవెల్లి ఎల్లమ్మ మాత ప్రసిద్ధి చెందిందని సిద్దిపేట త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ అన్నారు. ఆదివారం సీఐ దంపతులు రేణుకమాత ఆలయంలో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సీఐ దంపతులను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. అనంతరం అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ మేరకు ఆలయ విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయం చైర్మన్ ఏల్పుల మహేష్, మాజీ సర్పంచ్ సద్ది రాజిరెడ్డి, చందిరి దుర్గారెడ్డి, కొండ్ర యాదగిరి తదితరులు ఉన్నారు.

### శ్రీహరి మృతి తీరని లోటు



నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

**హుస్నాబాద్:** బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్ర శ్రీహరి మృతి ప్రజలకు తీరని లోటని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయన సేవలు అందించిన వ్యక్తి శ్రీహరి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్వర్ పాష, నియోజకవర్గ అధికార ప్రతినిధి మల్లికార్జున్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ బీలునాయక్, మాజీ ఎంపీపీలు మానస, లక్ష్మి, నాయకులు రాజిరెడ్డి, రామకృష్ణ, వికాస్ యాదవ్, శ్రీనివాస్, రాజేందర్ రెడ్డి, రమేష్ తదితరులు ఉన్నారు.

**కోహెడలో ఘన నివాళి**

**కోహెడ(హుస్నాబాద్):** బీఆర్ఎస్ రాష్ట్ర నేత కర్ర శ్రీహరి మృతి పార్టీకి తీరని లోటని మాజీ ఎంపీపీ కొక్కుల కీర్తి అన్నారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కర్ర శ్రీహరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శ్రీకాంత్, లక్ష్మయ్య, సురేశ్, మహేందర్, రాజేశ్వర్‌రావు, రాజిరెడ్డి, రాజయ్య, సర్వార్, సంపత్, శంకర్, శ్రీనివాస్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

### పరామర్శ

**చిన్నకోడూరు(సిద్దిపేట):** మండల పరిధిలోని అల్లీపూర్‌కి చెందిన బీఆర్ఎస్ నాయకుడు శ్రీనివాస్ ఇటీవల మృతి చెందాడు. ఈ మేరకు ఆదివారం బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్‌లు పరామర్శించారు. అదే విధంగా గ్రామానికి చెందిన లక్ష్మణ్ భార్య మృతి చెందగా.. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం మృతుల కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు రాధాకృష్ణ శర్మ, కాముని శ్రీనివాస్, పాపయ్య తదితరులు ఉన్నారు.

### సేవా కార్యక్రమాలు చేపట్టాలి

**శివ్వంపేట(నర్సాపూర్):** ఈ నెల 17న ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా 15 రోజుల పాటు పలు సేవా కార్యక్రమాలు చేపట్టాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశ్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈనెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు రక్తదాన శిబిరాలు, అమ్మ పేరుతో మొక్కలు నాటడం, కుల వృత్తులు, రిటైర్డ్ అధికారులను సన్మానించడంతో పాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లో పండ్ల పంపిణీ చేపట్టాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి కవితారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు రవి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కొండల్‌రావు, జిల్లా కార్యదర్శులు అశోక్ సాదుల, భిక్షపతి, నాయకులు వినోద్ కుమార్, కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

**◆ 17న తాపీ కార్మికుల సమావేశం**

**దుబ్బాకటౌన్:** రాయపోల్‌లో ఈ నెల 17న మండల తాపీ కార్మికుల సంఘం సమావేశం నిర్వహించనున్నట్లు మండల తాపీ కార్మిక సంఘం సీనియర్ నాయకుడు పెద్దోళ్ల ఆంజనేయులు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తాపీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటామన్నారు.

**◆ నూతన కమిటీ ఎన్నిక**

**హుస్నాబాద్:** పట్టణంలోని ఎల్ఐసీ కాలనీలో ఆదివారం కాలనీవాసులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్ఐసీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కమిటీ గౌరవ అధ్యక్షులుగా గూళ్ల రాజు, జెట్టి వెంకటస్వామి, నాగిడి నరసింహ రెడ్డి, అధ్యక్షుడిగా బానోతు సర్వర్ నాయక్, ప్రధాన కార్యదర్శిగా గుండ సంపత్ రెడ్డి, సహాయ కార్యదర్శిగా భూక్య ఈర్య నాయక్, ఉపాధ్యక్షులుగా దరిపెల్లి రాజు, కక్కెర్ల మల్లికార్జున్, ఓద్నాల బాల్‌లింగంతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

**◆ ఆలయ అభివృద్ధికి కృషి**

**నంగునూరు(సిద్దిపేట):** ఆలయ అభివృద్ధికి తన వంతుగా సహాయ, సహకారాలు అందజేస్తామని భారత చైతన్య యువజన పార్టీ రాష్ట్ర నాయకుడు గడగోని చక్రధర్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని అతి పురాతనమైన అభయాంజనేయ దేవాయలంలో సొంత ఖర్చులతో రేకుల షెడ్డు నిర్మాణానికి ఆదివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో శివగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

**◆ పరామర్శ**

**కొండపాక(గజ్వేల్):** కొండపాక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వైస్ చైర్మన్ పిస్క అమరేందర్ తల్లి ఇటీవల మృతి చెందారు. ఈ మేరకు ఆదివారం మాజీ మంత్రి హరీష్‌రావు, ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డిలు పరామర్శించారు. కుకునూరుపల్లిలోని మాయన నివాసంలో భాగమ్మ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దేశపతి శ్రీనివాస్, రైతు బంధు సమితి రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యులు దేవి రవిందర్, నాయకులు కుమార్, మల్లం ఐలయ్య, భూములుగౌడ్ పాల్గొన్నారు.

**◆ ఉచిత వైద్య శిబిరం**

**బెజ్జంకి(సిద్దిపేట):** మండలంలోని తోటపల్లిలో కరీంనగర్ స్మార్ట్ సిటీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ మేరకు రోగులను పరీక్షించి సుమారు రూ.50 వేల మందులను అందజేశారు. అలాగే వృద్ధులకు చేతి కర్రలు, మోకాళ్ల పట్టీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నర్సింగారావు, క్లబ్ అధ్యక్షుడు కిరణ్ కుమార్, అశోక్‌రావు, సరళ, ప్రభాకర్ రెడ్డి, శివకుమార్, డాక్టర్ సుదాకర్‌రెడ్డి, లింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో సమాచార హక్కు చట్టం సాధన కమిటీ నాయకులు

## ఆర్టీఐపై ప్రజలకు అవగాహన

**సిద్దిపేటకమాన్:** ఆర్టీఐ ప్రాధాన్యతను ప్రజలకు చేరవేయాలని సమాచార హక్కు చట్టం సాధన కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు చంటి ముదిరాజ్ అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాచారం హక్కు చట్టం స్థాపించి 20ఏళ్ల పూర్తయిందన్నారు. ఏదైనా ఆర్టీఐ సంబంధిత సాంకేతిక మద్దతు కోసం జాతీయ, రాష్ట్ర కమిటీలను సంప్రదించాలన్నారు. అనంతరం ఆర్టీఐకి సంబధించిన పలు అంశాలను వివరించారు. సమావేశంలో జితేందర్, వెంకటేశం, దిలీప్, కృష్ణ, ఆంజనేయులు, సంజీవ్‌కుమార్, రామశ్రీ, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల్లో మనోస్థైర్యం నింపడమే లక్ష్యం

**తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ డిసేబుల్డ్ రాష్ట్ర అధ్యక్షుడు నరేందర్‌గౌడ్**



మాట్లాడుతున్న నరేందర్‌గౌడ్

**గజ్వేల్‌రూరల్:** దివ్యాంగుల్లో మనోస్థైర్యం నింపుతూ క్రీడలపై ప్రోత్సహిస్తున్నామని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఫర్ ది డిసేబుల్డ్ రాష్ట్ర అధ్యక్షుడు నరేందర్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని ఐఓసీ సమీపంలోని మైదానంలో ఆదివారం తెలంగాణ దివ్యాంగుల క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లీగ్ మ్యాచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల్లో ఒక్కరినైనా భారతజట్టుకు ప్రాతినిధ్యం వహించేలా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగ క్రీడాకారులకు ఏదైనా అవసరముంటే నేరుగా సంప్రదించాలని సూచించారు. అనంతరం నిజామాబాద్–సిద్దిపేట జిల్లా జట్ల మధ్య క్రికెట్ పోటీలు ఆసక్తికరంగా సాగాయి. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్, గౌరీశంకర్, దయానందరెడ్డి, హరిశ్చంద్రప్రసాద్, క్రీడాకారులు పాల్గొన్నారు.

## సంస్మరణ సభను జయప్రదం చేయండి

**సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి**

**చేర్యాల(సిద్దిపేట):** ఈ నెల 16న దూల్మిట్ట మండలంలోని బైరాన్‌పల్లి బురుజు వద్ద నిర్వహించే అమరవీరుల సంస్మరణ సభను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం పార్టీ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ మేరకు కొంగరి వెంకట్‌మావో అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్మరణ సభకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్థానిక గాంధీ సెంటర్ నుంచి బైరాన్‌పల్లి వరకు బైక్ ర్యాలీ ఉంటుందన్నారు. ఈ సంస్మరణ సభకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్కా రాములు హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు శశిధర్, సత్తిరెడ్డి, యాదగిరి, అరుణ్‌కుమార్, మల్లేశం, రాజు, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మల్లారెడ్డి

## భగీరథ పైపులైన్ లీకేజీతో నీరు కలుషితం

**దౌల్తాబాద్ (దుబ్బాక):** మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీతో నీరు కలుషితమవుతోంది. మండల పరిధిలోని గాజులపల్లి శివారులో జంగాపల్లి రోడ్డు వద్ద మిషన్ భగీరథ తాగునీరు పైప్‌లైన్‌కు లీకేజీ పడింది. ఈ కారణంగా నీరు కలుషితం కావడంతో పాటు వృథాగా పారుతోంది. దీంతో తాగునీరు కలుషితమై వ్యర్థ పదార్థాలు కలిసి ప్రజలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని ఆరోపిస్తున్నారు. గత కొంతకాలంగా నీరు కలుషితమవుతున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. కనీసం ఈ ప్రాంతాల్లో సందర్శించడం లేదని చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ కలుషితమైన నీళ్లు తాగి ప్రజలు అవస్థలకు గురికాక ముందే జిల్లా అధికారులు పైప్ లైన్ లీకేజీకి మరమ్మతులు చేపట్టి మంచి నీరు అందించాలని ప్రజలు కోరుతున్నారు.



లీకేజీతో రోడ్డుపై వృథాగా పారుతున్న నీరు

## పొంచివున్న ప్రమాదం

**చేర్యాల(సిద్దిపేట):** మున్సిపల్ పరిధిలో ఇటీవల జాతీయ రహదారి పనుల్లో భాగంగా సైడ్ కాల్వ పనులు చేపట్టారు. అయితే ఈ పనులు చేపట్టిన అధికారులు 6వ వార్డు భవానినగర్ కాలనీలో అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభం తొలగించకుండా గుంతలు తవ్వి అసంపూర్తిగా వదిలేశారు. దీంతో ప్రమాదం పొంచి ఉందని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని జాతీయ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుట్టి సత్యనారాయణ డిమాండ్ చేశాడు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో సుమారు రెండేళ్లుగా కొనసాగుతున్న 365బీ జాతీయ రహదారి పనుల్లో భాగంగా చేపట్టిన సైడ్ కాల్వ నిర్మాణంలో అడ్డుగా ఉన్న 11 కేవీ విద్యుత్ స్తంభాన్ని తొలగించకుండా వదిలేయడంతో ప్రమాదకరంగా మారిందన్నారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే గుంతలు తవ్వి అసంపూర్తిగా వదిలేయడంతో కాలనీవాసులు గుంతలో పడుతున్నారన్నారు. జాతీయ రహదారి విస్తరణ కోసం ఎన్నో సర్వేలు నిర్వహించిన అధికారులు సమస్యాత్మకంగా ఉన్న ప్రాంతాల్లో మాత్రం తమకేమీ పట్టనట్లు నిర్మాణ పనులు నిలిపివేయడం సరికాదన్నారు. పట్టణంలో సుమారు 90 శాతం డ్రైనేజీ పనులు పూర్తి చేసిన అధికారులు భవాని నగర్ కాలనీకి వెళ్లే మార్గంలోని డ్రైనేజీ నిర్మించకపోవడ ఏంటని ప్రశ్నిస్తున్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి మధ్యలో నిలిపివేసిన డ్రైనేజీ నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని కోరారు.



రహదారి పక్కన అసంపూర్తిగా వదిలేసిన సైడ్ కాల్వలో విద్యుత్ స్తంభం

## ప్రోటోకాల్ ఉల్లంఘన

**కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే పల్లా**

**చేర్యాల(సిద్దిపేట):** జనగామ అసెంబ్లీ నియోజకవర్గంలో భాగమైన చేర్యాల మండల పరిధిలో కాంగ్రెస్ నాయకులు ప్రోటోకాల్ ఉల్లంఘించి పనుల ప్రారంభం, శంకుస్థాపనలు చేస్తున్నారని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాడు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి చేయనున్నట్లు వాట్సాప్ గ్రూపుల్లో పోస్ట్ చేశారు. అయితే చెప్పినట్లుగా ఆదివారం మండలంలోని కాశగుడిసెలులో భవన నిర్మాణానికి స్థానిక నాయకులతో కలిసి కొమ్మూరి శంకుస్థాపన చేశాడు. ఈ విషయాన్ని వాట్సాప్ గ్రూపుల ద్వారా తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే పల్లా దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంపై కలెక్టర్‌కు ప్రోటోకాల్ ఉల్లంఘన చేస్తున్న తీరును ఎమ్మెల్యే తెలియజేశారు. వెంటనే స్పందించిన కలెక్టర్ మండల స్థాయి అధికారులకు ఫోన్ చేసి ప్రోటోకాల్ సమస్య రాకుండా అభివృద్ధి పనుల శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిసింది. కలెక్టర్ ఆదేశాలను అధికారులు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి తెలియజేయడంతో శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు రద్దు చేసుకున్నారు. అయితే కార్యకర్తలు మాత్రం అభివృద్ధి పనులు పరిశీలించారని తిరిగి పోస్టులు పెట్టడం గమనార్హం.



కాశగుడిసెలులో పనులకు శంకుస్థాపన చేస్తున్న కొమ్మూరి